సాక్షి నిర్మల్
శనివారం : 7 : జూన్ : 2025



రైతుకు సహకారం

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో చిన్న, సన్నకారు రైతులను మరింత ఆర్థిక బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఎఫ్‌పీవో పథకాన్ని ప్రవేశపెట్టింది.

10లో▸



బాసరలో భక్తుల సందడి

బాసర శ్రీజ్ఞాన సరస్వతీ ఆలయం శుక్ర వారం భక్తులతో సందడిగా మారింది. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చారు. అమ్మవారిని దర్శించుకున్నారు.

10లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
38.4 /27.3

ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. మధ్యాహ్నం వేడి, ఉక్కపోత పెరుగుతుంది. సాయంత్రం అక్కడక్కడ జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

8న చేపమందు పంపిణీ

సారంగపూర్: మృగశిర కార్తె పురస్కరించుకుని మండలంలోని బీరవెల్లి గ్రామంలో ఈనెల 8న మధ్యాహ్నం 2 గంటల నుంచి చేప మందు పంపిణీ చేయనున్నట్లు సగ్గం సోదరులు లింగం, కృష్ణ తెలిపారు. ఆస్తమా, ఉబ్బసం వ్యాధులు ఉన్నవారు చేపమందు స్వీకరించాలని సూచించారు. చేపమందు పంపిణీ కోసం గ్రామస్తులు ఏర్పాట్లు చేస్తున్నారని పేర్కొన్నారు.

'పది' పరీక్షలకు 11 మంది గైర్హాజరు

నిర్మల్ రూరల్: జిల్లాలో శుక్రవారం జరిగిన పదో తరగతి పరీక్షలకు 11 మంది విద్యార్థులు గైర్హాజర్ అయ్యారు. మొత్తం 126 మందికి 115 మంది హాజరవగా, 11 మంది గైర్హాజరయ్యారు. జిల్లా కేంద్రంలోని సోమవార్‌పేట్ ప్రభుత్వ బాలికల పాఠశాల పరీక్ష కేంద్రాన్ని జిల్లా పరీక్షల సహాయ అధికారి పరమేశ్వర్ తనిఖీ చేశారు.

పత్రికల కొనుగోలుకు నిధులు

మామడ: పాఠశాలల్లో విద్యార్థులు పాఠ్యాంశాలతోపాటు గ్రంథాలయం సద్వినియోగం చేసుకునేలా విద్యాశాఖ ప్రోత్సాహం అందిస్తోంది. పీఎంశ్రీ(ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా) పథకంలో భాగంగా ఎంపికైన పాఠశాలలకు ప్రత్యేక నిధులను కేటాయించింది. జిల్లాలో ఎంపికైన 20 ఈ పాఠశాలల్లో దినపత్రికల కొనుగోలు నిర్వహణ కోసం 2025–26 సంవత్సరానికి ప్రత్యేక నిధులు మంజూరు చేసింది. ఒక్కో పాఠశాలకు రూ.10వేల చొప్పున జిల్లాకు రూ.2 లక్షలు మంజూరు అయ్యాయి. ఈ డబ్బులతో తెలుగు, హిందీ, ఉర్దూ, ఇంగ్లిష్ దినపత్రికలు కొనగోలు చేసి గ్రంథాలయంలో విద్యార్థులకు అందుబాటులో ఉంచాలని సూచించింది.

'ఉపాధి' పనుల పరిశీలన

భైంసారూరల్: మండలంలోని ఆయా గ్రామాల్లో ఉపాధిహామీ పథకంలో చేపట్టిన పనులను కేంద్ర జలశక్తి అభియాన్ బృందం శుక్రవారం పరిశీలించింది. 21 గ్రామాల్లో మహాత్మా గాంధీ ఉపాధిహామీ పథకంలో న్విహించిన 33 పనులకు సంబంధించిన పనులను క్షేత్రస్థాయిలో తనిఖీలు చేశారు. భూగర్భ జలాలు అడుగంటకుండా, నీటి నిల్వలు పెంచేలా చేపట్టిన ఇంకుడు గుంతలు, మట్టి కట్టల పనులను పరిశీలించారు. కేంద్ర జలశక్తి అభియాన్ టీం మెంబర్ సతీశ్, డీఆర్పీ గంగాప్రసాద్, ఫైనాన్స్ మేనేజర్ సందీప్, ఏపీవో శివలింగం, టీఏలు, కార్యదర్శులు ఉన్నారు.

సజావుగా ధాన్యం కొనుగోళ్లు

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాలో వరి ధాన్యం కొనుగోళ్లు సజావుగా, సమర్థవంతంగా నిర్వహిస్తున్నామని కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో పౌరసరఫరాల శాఖ అధికారులతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ చివరి దశకు చేరుకుందని తెలిపారు. తడిసిన ధాన్యాన్ని కూడా సేకరిస్తున్నామన్నారు. ఇప్పటివరకు 1,76,843 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామని, గతేడాదితో పోలిస్తే 6,090 మెట్రిక్ టన్నులు అధికంగా కొనుగోలు చేశామని తెలిపారు. 38,841 మంది రైతులు ధాన్యం విక్రయించగా, మొత్తం ప్రక్రియను డీసీఎస్‌వో కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ ద్వారా పర్యవేక్షిస్తున్నట్లు వివరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, డీసీఎస్‌వో కిరణ్‌కుమార్, మేనేజర్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

చైల్డ్‌పోర్నోగ్రఫీ నేరం

- ఎస్పీ జానకీషర్మిల

నిర్మల్‌టౌన్: చైల్డ్ పోర్న్ వీడియోలు చూసినా, సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేసిన కఠిన చర్యలు తప్పవని ఎస్పీ జానకీషర్మిల హెచ్చరించారు. ఇటీవల కొందరు చైల్డ్ పోర్న్ వీడియోలు చూడటం, వాటిని సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేయడం, షేర్ చేయడం, ఫార్వర్డ్ చేయడం లాంటి చట్ట విరుద్ధమైన చర్యలకు పాల్పడుతున్నట్లు గుర్తించామని తెలిపారు. ఇటువంటి చర్యలు చట్టరీత్యా నేరమని, వీటిని సహించేది లేదని స్పష్టం చేశారు. చైల్డ్ పోర్నగ్రాఫీ తీవ్రమైన నేరమని, దీనికి పాల్పడేవారిపై చట్ట ప్రకారం పోక్సో చట్టం కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. జిల్లాలో ఇలాంటి చర్యలకు పాల్పడుతున్న వారిపై ఐటీ నిపుణులు ప్రత్యేక దృష్టి సారించారని ఎస్పీ తెలిపారు. ఎవరైనా ఇ లాంటి కార్యకలాపాలకు పాల్పడితే 871265 9599 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

బక్రీద్‌కు భారీ బందోబస్తు

బక్రీద్ పండుగ పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ జానకీ షర్మిల తెలిపారు. జిల్లా వ్యాప్తంగా పది రోజులుగా అంతర్రాష్ట్ర , అంతర్ జిల్లా చెక్ పోస్టులు ఏర్పాటు చేసి 24 గంటలు వాహనాల తనిఖీలు చేపడుతున్నామని ఎస్పీ తెలిపారు. సోషల్ మీడియాలో అసత్య పోస్టులు పెట్టి ఇతరుల మనోభావాలు దెబ్బతీస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

అడెల్లు.. అమర్‌రహే!

- ముగిసిన ఉద్యమ ప్రస్థానం
- బీజాపూర్ ఎన్‌కౌంటర్‌లో 'మైలారపు' మృతి
- మూడు దశాబ్దాలుగా అరణ్యంలోనే..
- విషాదంలో పొచ్చెర గ్రామం
- మృతదేహం అప్పగించాలంటున్న కుటుంబీకులు, గ్రామస్తులు



అడెల్లు సోదరుడి ఇంటివద్ద గుమిగూడిన గ్రామస్తులు

మైలారపు అడెల్లు (ఫైల్)

బోథ్: మావోయిస్టులకు మరో ఎదురుదెబ్బ తగిలింది. మూడు దశాబ్దాల ఉద్యమ కెరటం నింగికెగిసింది. నూనుగు మీసాల ప్రాయంలో అడవిబాట పట్టి విప్లవోద్యమంలో అంచెలంచెలుగా ఎదిగిన ఆ గొంతు శాశ్వతంగా మూగబోయింది. మావోయిస్టు రాష్ట్ర కమిటీ సభ్యుడు, కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల డివిజన్ ఇన్‌చార్జి మైలారపు అడెల్లు అలియాస్ భాస్కర్(53) ప్రస్థానం ముగిసింది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లా నేషనల్ పార్క్ అటవీ ప్రాంతంలో శుక్రవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో అడెల్లు మృతి చెందాడు. ఉదయం నుంచి మావోయిస్టులు, భద్రతా బలగాల మధ్య జరిగిన కాల్పుల్లో ఆయన తుదిశ్వాస విడిచారు. బాల్యం నుంచి అభ్యుదయ భావాలు కలిగిన అడెల్లు మరణవార్త జిల్లాలోని పొచ్చెర గ్రామాన్ని తీవ్రంగా కలిచివేసింది. 30 ఏళ్ల క్రితం జ్ఞాపకాలను ఆ ఊరు గుర్తు చేసుకుంది.

అడెల్లు ప్రస్థానం ఇదీ..

అడెల్లు స్వస్థలం ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలంలోని పొచ్చెర గ్రామం. తల్లిదండ్రులు పోతన్న–పోషవ్వకు నలుగురు సంతానం. పెద్ద అడెల్లు, సీతారాం, అడెల్లు, చిన్న అడెల్లు. తల్లిదండ్రులు కొన్నేళ్ల క్రితం మృతిచెందారు. దున్నే వాడిదే భూమి నినాదం, పేదరికం అడెల్లును నక్సల్ వైపు నడిపించింది. నిరుపేద కుటుంబంలో పుట్టిన ఆయనను 1989లో జరిగిన భూపోరాటం ఆకర్షించింది. అడెల్లు చిన్నప్పటి నుంచి తల్లిదండ్రులు, సోదరులతో కలిసి కూలి పనులకు వెళ్తుండేవాడు. భూస్వాముల పెత్తందారితనాన్ని తరచూ ప్రశ్నించేవాడు.

విద్యాభ్యాసం..

బోథ్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి వరకు చదివాడు. 1989లో నిర్మల్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పూర్తి చేశాడు. నిర్మల్‌లో డిగ్రీ చదువుతున్న రోజుల్లో విప్లవ సిద్ధాంతాలకు ఆకర్షితుడై రాడికల్ స్టూడెంట్ యూనియన్‌లో చేరాడు.

రాడికల్ నుంచి దళంలోకి..

రాడికల్ స్టూడెంట్ యూనియన్‌లో చురుగ్గా పాల్గొనేవాడు. అధ్యక్షుడిగా పనిచేశాడు. గ్రామాల్లో తిరుగుతూ ప్రజలను చైతన్యపరిచాడు. ఈ క్రమంలోనే 1995 ప్రాంతంలో నక్సలైటుగా మారాడు. దళంలోకి ప్రవేశించాడు. మొదట బోథ్ దళ సభ్యుడిగా పని చేసిన ఆయన ఇంద్రవెల్లి డిప్యూటీ కమాండర్ స్థాయికి ఎదిగాడు. అక్కడి నుంచి చత్తీస్‌గఢ్ దండకారణ్యంలోకి వెళ్లాడు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాపై పూర్తిస్థాయి పట్టు సాధించాడు. రాష్ట్ర కమిటీ సభ్యుడిగా, కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల డివిజన్ కమిటీకి సారథ్యం వహిస్తూ.. కరోనా సమయంలో ఉమ్మడి జిల్లాలో రిక్రూట్‌మెంట్ బాధ్యతలు చేపట్టినట్లు సమాచారం. గతంలో అడెల్లు దళాన్ని పట్టుకోవడమే లక్ష్యంగా పోలీస్ బలగాలు ఉమ్మడి జిల్లాలోని తిర్యాణి, మంగి, బోథ్, పెంబి, ఖానాపూర్, మామడ ప్రాంతాల్లో జల్లెడ పట్టినా ఆచూకీ లభ్యం కాలేదు. పలుమార్లు చిక్కినట్టే చిక్కి తప్పించుకున్నట్లు వినికిడి. 2020 సెప్టెంబర్ 19న కదంబ అడవుల్లో పోలీసులు, మావోయిస్టులకు జరిగిన ఎన్‌కౌంటర్‌లో అడెల్లు తృటిలో తప్పించుకున్నాడు. ప్రస్తుతం అడెల్లుపై రూ. 25 లక్షల రివార్డు ఉంది.

కంతి లింగవ్వతో వివాహం..

అడెల్లు దళంలో చేరిన సందర్భంలోనే అప్పటికే అందులో కొనసాగుతున్న నిర్మల్ జిల్లా కడెం మండలంలోని లక్ష్మీసాగర్ గ్రామానికి చెందిన కంతి లింగవ్వతో వివాహం జరిగింది. ఈ క్రమంలో ఇద్దరు కీలక సభ్యులుగా ఎదిగారు. లింగవ్వ జిల్లా కమిటీ సభ్యురాలిగా ప్రధాన భూమిక పోషించారు. మంగీ ప్రాంతంలో రిక్రూట్‌మెంట్ చేసినట్లు తెలుస్తోంది. 2022 డిసెంబర్‌లో లింగవ్వ మహారాష్ట్ర, చత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతిచెందారు. అప్పటి నుంచి అడెల్లు ఛత్తీస్‌గఢ్ దండకారణ్యంలోకి వెళ్లారని తెలుస్తోంది.

ఎట్లున్నడో అనుకునేలోపే..

కగార్ పేరుతో కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులను ఏరివేయాలని వారికి పట్టున్న అడవుల్లో కూంబింగ్ షురూ చేసింది. ఎన్‌కౌంటర్లలో వందల సంఖ్యలో మావోయిస్టులు మృతి చెందిన తరుణంలో అడెల్లు ఎక్కడున్నాడో.. ఎలా ఉన్నాడోనని కుటుంబీకులు ఆందోళన చెందారు. ఈ నేపథ్యంలో ఆయన మరణ వార్త వారి గుండెను చెరువు చేసింది. చివరి చూపు కోసం మృతదేహాన్ని అప్పగించాలని కుటుంబీకులు, గ్రామస్తులు కోరుతున్నారు.

చివరి చూపు చూడాలని ఉంది



నా తమ్ముడు అడెల్లును చివరి చూపు చూడాలని ఉంది. చిన్నతనంలో దళంలోకి వెళ్లాడు. ప్రజల కోసమే పని చేశాడు. ఇంతకాలం ఎక్కడున్నా బతికే ఉన్నాడనే ఆశ ఉండేది. ఇప్పటికి దాదాపు 30 ఏళ్లు దాటింది చూసి. మృతదేహాన్ని అప్పగించాలని కోరుతున్నా.

– మైలారపు సీతారం, అడెల్లు సోదరుడు, పొచ్చెర

మంచి చేయాలన్న తపన ఉండేది



చిన్నప్పటి నుంచి అడెల్లుకు మంచి చేయాలన్న తపన ఉండేది. పేదల పట్ల సేవాగుణం చూపుతూ అందరితో కలివిడిగా ఉండేవాడు. బాగా చదువుకునేవాడు. అడెల్లు ఎన్‌కౌంటర్‌లో చనిపోవడం జీర్ణించుకోలేకపోతున్నాం.

– నడికుంట నడిపి అడెల్లు, గ్రామస్తుడు

బడిబాట లక్ష్యం పెంచాలి

- కలెక్టర్ అభిలాష అభినవ్

సారంగపూర్: బడిబాట కార్యక్రమం ద్వారా గతేడాదికన్నా అధికంగా విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని, లక్ష్యాన్ని మించి అడ్మిషన్లు చేయాలని కలెక్టర్ అభిలాష అభినవ్ సూచించారు. మండలంలోని యాకర్‌పెల్లి గ్రామంలో బడిబాట కార్యక్రమాన్ని శుక్రవారం పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మండల వ్యాప్తంగా ఎంతమంది విద్యార్థులను చేర్పించారని ఎంఈవో మధుసూదన్‌ను అడిగి తెలుసుకున్నారు. గతేడాది 6వేల పైచిలుకు విద్యార్థుల లక్ష్యం చేర్చుకున్నామని తెలిపారు. ఈసారి లక్ష్యాన్ని అధిగమించాలని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ కిశోర్‌కుమార్, తహశీల్దార్ శ్రీదేవి, ఎంపీవో అజీజ్‌ఖాన్, ఆయా గ్రామ పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

రైతుల సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు

అపరిష్కృతంగా ఉన్న భూముల సమస్యలను పరిష్కరించేందుకే గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. యాకర్‌పల్లి గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సును అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. మొత్తం 36 దరఖాస్తులు రాగా అందులో 19 దరఖాస్తులు కేవలం 241సర్వే నంబర్‌పైనే రావడంతో ఇదేంటని తహసీల్దార్ శ్రీదేవిని అడిగారు. తహసీల్దార్ బదులిస్తూ 241సర్వే నంబరు ప్రభుత్వ భూమి అని కలెక్టర్‌కు వివరించారు. దీని విస్తీర్ణం 40.36 ఎకరాలని తెలిపారు. ఇదే సర్వే నంబరులో అసైన్డ్ పట్టాలు 40.36 ఎకరాలు ఇవ్వాల్సి ఉండగా 77.17 ఎకరాలకు పట్టాలు జారీ చేశారని పేర్కొన్నారు. దీంతో ఆశ్చర్యపోయిన కలెక్టర్ ఇదేలా సాధ్యమని తహశీల్దార్‌ను అడిగారు. కాలక్రమేణా పట్టామార్పిడులు జరిగిన నేపథ్యంలో, అసలు పట్టాదారులు మరణించగా వారి వారసుల పేర్లపై మార్పిడి, క్రయ విక్రయాల నేపథ్యంలో ఇలాంటి పొరపాటు జరిగి ఉండవచ్చని వివరించారు. సమస్య పరిష్కరించడానికి ప్రత్యేకంగా ఒక టీమ్ ఏర్పాటు చేసి 40.36 ఎకరాల భూమిని సర్వే చేయించాలని తహశీల్దార్‌కు సూచించారు. ప్రస్తుతం సాగుచేస్తున్న రైతుల వివరాలు సేకరించి ఎవ రైతే సాగుచేస్తున్నారో వారికే పట్టాలు ఉంచి మిగతా వారి పట్టాలు రద్దు చేయాలని ఆదేశించారు. అనంతరం యాకర్‌పెల్లి గ్రామపంచాయతీ ఆవరణలో కలెక్టర్, అడిషనల్ కలెక్టర్ మొక్కలు నాటారు.

వరదల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి

నిర్మల్‌చైన్‌గేట్: వర్షాకాలంలో సంభవించే వరదలను సమర్థంగా ఎదుర్కొనేందుకు సంబంధిత శాఖల అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ తన చాంబరులో జిల్లా ఫ్లడ్ మ్యానువల్–2025 పుస్తకాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గతేడాది జిల్లాలో నమోదైన వరదల వివరాలు, వాటి తీవ్రత, వాటివల్ల జరిగిన ఆస్తి, పంట నష్టం తదితర సమాచారాన్ని ఈ పుస్తకంలో సమగ్రంగా పొందుపరిచినట్లు తెలిపారు. ప్రస్తుత వర్షాకాలంలో తక్షణం తీసుకోవాల్సిన చర్యలు, సహాయక చర్యలు, పునరావాస ఏర్పాట్లు వంటి అంశాలు ఈ మ్యానువల్‌లో పొందుపరిచినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్ కుమార్, ముఖ్య ప్రణాళికాధికారి జీవరత్నం పాల్గొన్నారు.



పిల్లలకు బిస్కెట్లు పంపిణీ చేస్తున్న అధికారులు

నిబంధనలు పాటించాలి

జిల్లాలోని ప్రైవేట్, ప్రభుత్వ ఆస్పత్రులు క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ – 2010 నిబంధనలను కచ్చితంగా పాటించాల్సిందేనని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా స్థాయిలో క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ (రిజిస్ట్రేషన్ అండ్ రెగ్యులేషన్) చట్టం – 2010, మహిళ శిశు రక్షణ చట్టాల అమలు, పర్యవేక్షణ అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులలో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని మహిళా శిశు రక్షణ చట్టాల అమలులో నిర్లక్ష్యం వహించొద్దని పేర్కొన్నారు. ఆసుపత్రులు రోగుల నుంచి అధిక చార్జీలు వసూలు చేయకూడదని, ప్రతీ ఆస్పత్రిలో రేటు చార్ట్‌ను రిసెప్షన్ వద్ద స్పష్టంగా ప్రదర్శించాలన్నారు. ప్రతీ ఆస్పత్రిలో కనీస ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, బయో మెడికల్ వేస్ట్‌ను సక్రమంగా నిర్వహించాలన్నారు. జిల్లాలోని అన్ని ప్రైవేట్ వైద్య సంస్థలు, స్కానింగ్ సెంటర్లు, డయాగ్నొస్టిక్ ల్యాబ్‌లు తప్పనిసరిగా క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ చట్టం కింద నమోదు చేసుకోవాలన్నారు. పీసీ అండ్ పీఎన్డీటీ చట్టం అమలుపై ప్రత్యేక దృష్టి సారిస్తూ, లింగ నిర్ధారణకు పాల్పడే వారిపై నిఘా పెట్టాలన్నారు. లింగ నిర్ధారణ చర్యలకు పాల్పడే వారిపై ఫిర్యాదు చేసేందుకు ప్రజలు టోల్‌ఫ్రీ నంబర్ 7337448722 ను సంప్రదించాలని సూచించారు. ఆన్‌లైన్ మానిటరింగ్ వ్యవస్థను మరింత పటిష్టం చేయాలని సూచించారు. అన్ని వివరాలను ఆన్‌లైన్‌లో సమయానికి అప్‌డేట్ చేయాలన్నారు. అనంతరం పీసీ అండ్ పీఎన్డీటీ చట్టం, అమ్మ రక్ష పోస్టర్లను సంబంధిత అధికారులతో కలిసి ఆవిష్కరించారు. సమావేశంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ రాజేందర్, జిల్లా జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ గోపాల్ సింగ్, డీసీహెచ్‌ఎస్ సురేశ్, సరోజ, సునీల్, ప్రైవేట్ వైద్య సంస్థల ప్రతినిధులు, డయాగ్నొస్టిక్ సెంటర్లు, ల్యాబ్‌ల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇదెక్కడి ప'రేషాన్'!

- మూడునెలల కోటాతో ఇబ్బందులు
- బయోమెట్రిక్ జాప్యంతో గంటల తరబడి క్యూ
- ఉదయం నుంచే దుకాణాల వద్ద పడిగాపులు



నిర్మల్‌లో రేషన్‌షాపు వద్ద పడిగాపులు

భైంసాటౌన్: వర్షాకాలం నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తెల్ల రేషన్ కార్డుదారులకు మూడు నెలల రేషన్ బియ్యాన్ని ముందస్తుగా ఒకేసారి పంపిణీ చేస్తున్నాయి. ఒక్కో యూనిట్‌కు కేంద్ర ప్రభుత్వం ఐదు కిలోలు, రాష్ట్ర ప్రభుత్వం అదనంగా ఒక కిలో కలిపి మొత్తం ఆరు కిలోల చొప్పున అందిస్తోంది. ప్రభుత్వ ఉద్దేశం సానుకూలమైనప్పటికీ, క్షేత్రస్థాయిలో పంపిణీ ప్రక్రియలో జాప్యం, సాంకేతిక సమస్యలతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

బయోమెట్రిక్ సమస్యలతో...

రేషన్ పంపిణీలో బయోమెట్రిక్ విధానం ప్రధాన అడ్డంకిగా మారింది. సాధారణంగా ప్రతీ నెల ఒక్కసారి వేలిముద్ర ద్వారా బియ్యం పొందే లబ్ధిదారులు, ఈసారి మూడు నెలల రేషన్ కోసం ఆరుసార్లు బయోమెట్రిక్ వేయాల్సి వస్తోంది. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే ఐదు కిలోలకు ఒకసారి, రాష్ట్ర ప్రభుత్వం అందించే ఒక కిలోకు మరోసారి వేలిముద్ర వేయడంతో పాటు, వేర్వేరుగా కాంటా చేయడం వల్ల ఒక్కో లబ్ధిదారు?3కు 15 నిమిషాల సమయం పడుతోంది. దీనితో పంపిణీ ప్రక్రియలో గణనీయమైన జాప్యం జరుగుతోంది. అదనంగా, ఈ–పోస్ యంత్రాల్లో సర్వర్ సమస్యలు తలెత్తడం లబ్ధిదారుల ఆందోళనను మరింత పెంచుతోంది.

భారీ క్యూ, సౌకర్యాల కొరత

రేషన్ దుకాణాల వద్ద ఉదయం 6 గంటల నుంచే లబ్ధిదారులు బారులు తీరుతున్నారు. గంటల తరబడి క్యూలో వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఇంటి పనులు, బయటి వ్యవహారాలను వదిలి రేషన్ కోసం గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోందని లబ్ధిదారులు వాపోతున్నారు. అంతేకాక, దుకాణాల వద్ద నీడ వసతులు లేకపోవడంతో ఎండలో ఇబ్బంది పడుతున్నట్లు చెబుతున్నారు. ఈ పరిస్థితులు లబ్ధిదారులను మరింత ఆందోళనకు గురిచేస్తున్నాయి.

నిల్వలపై ఆందోళన

సాధారణంగా ప్రతీ నెల 16 నుంచి 20 తేదీల మధ్య రేషన్ బియ్యం పంపిణీ పూర్తవుతుంది. అయితే, ఈసారి మూడు నెలల బియ్యం ఒకేసారి పంపిణీ చేయడంతో ప్రక్రియ ఆలస్యమవుతోంది. దీంతో బియ్యం నిల్వలు అయిపోతాయన్న భయంతో కార్డుదారులు రేషన్ దుకాణాలకు పరుగులు పెడుతున్నారు. అక్కడ దీర్ఘ క్యూలు, ఆలస్యం వల్ల బియ్యం అందుతుందో లేదోనన్న ఆందోళనలో ఉన్నారు. ఈ నెలాఖరు వరకు పంపిణీ కొనసాగించాలని వారు కోరుతున్నారు.

సమస్యల పరిష్కారానికి సూచనలు

ప్రభుత్వం ఈ సమస్యలను పరిష్కరించేందుకు కొన్ని చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు కోరుతున్నారు. బయోమెట్రిక్ ప్రక్రియను సరళీకరించి, ఒక్కసారి వేలిముద్రతో మొత్తం బియ్యం పొందే విధంగా ఏర్పాటు చేయాలని సూచిస్తున్నారు. అలాగే, సర్వర్ సమస్యలను త్వరగా పరిష్కరించడం, రేషన్ దుకాణాల వద్ద నీడ వసతులు, తాగునీరు వంటి ప్రాథమిక సౌకర్యాలను కల్పించాలని కోరుతున్నారు. ఈ చర్యలు అమలైతే లబ్ధిదారుల ఇబ్బందులు తగ్గే అవకాశం ఉంది.

మూడు గంటలు వేచి ఉన్నా...



రేషన్ బియ్యం తీసుకునేందుకు మూడు గంటలపాటు వేచి ఉన్నా. ఒక్కొక్కరికి ఆరుసార్లు వేలిముద్ర వేయాల్సి వస్తుంది. దీంతో గంటల తరబడి ఆలస్యమవుతోంది. దుకాణాల వద్ద ఎలాంటి సౌకర్యాలు లేవు. ఎండలో నిల్చోలేక ఇబ్బంది పడుతున్నాం.

– సాయినాథ్, భట్టిగల్లి, భైంసా

ఇంటి పని వదులుకుని...



మూడునెలల బియ్యం ఒకేసారి ఇస్తున్నరని దుకాణంకు వస్తే, ఇక్కడ గంటల కొద్ది ఆలస్యమైతుంది. ఆరుసార్లు వేలిముద్ర తీసుకుంటున్నరు. ఇంటి పని వదులుకుని దుకాణం వద్దనే గంటల తరబడి నిల్చున్న.

– అనితా బాయి, భట్టిగల్లి, భైంసా

మూగజీవాలపాలిట.. మృత్యుపాశాలు

- అప్రమత్తతతోనే ప్రమాదాలు నివారించవచ్చంటున్న అధికారులు
- తీగలు తెగితే వెంటనే సమాచారం ఇవ్వాలని సూచన

- కడెం మండలంలోని గంగాపూర్ గ్రామంలో ఇటీవల విద్యుత్ షాక్‌కుగురై ఆరు ఎద్దులు మృతి చెందాయి.
- లక్ష్మణచాంద మండలం పార్‌పెల్లి తాండాలో విద్యుత్‌షాక్‌తో నాలుగు రోజుల క్రితం గేదెలు మృతిచెందాయి. గడిచిన నెల రోజుల్లో విద్యుత్‌షాక్‌తో పదుల సంఖ్యలో మూగజీవాలు మృత్యువాతపడ్డాయి.



విద్యుత్ షాక్‌తో మృతి చెందిన ఎద్దులు(ఫైల్)

లక్ష్మణచాంద: వర్షాకాలంలో విద్యుత్ తీగలతో అప్రమత్తంగా ఉంటే ప్రమాదాలను అరికట్టవచ్చని విద్యుత్ శాఖ అధికారులు సూచిస్తున్నారు. నిర్లక్ష్యంతో మూగజీవాలు మృత్యువాతపడుతున్నాఇ. ఆస్తి నష్టం జరుగుతోంది. తెగిపడిన విద్యుత్ తీగలను తాకడం, సొంతంగా మరమ్మతులు చేయడం వంటివి ప్రమాదకరమని, ఏదైనా సమస్య తలెత్తితే విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని నిర్మల్ విద్యుత్ శాఖ డీఈ డి.నాగరాజు సూచించారు. రైతులు, విద్యుత్ వినియోగదారులు వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయన సలహాలు ఇచ్చారు.

విద్యుత్ తీగలతో అప్రమత్తం

తెగిన తీగలను తాకొద్దు: విద్యుత్ తీగలు తెగిపడినా, వేలాడుతున్నా లేదా లూజుగా ఉన్నా వాటిని తాకకూడదు. వెంటనే విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలి.

తడి బట్టలు ఆరవేయొద్దు: ఇండ్లలో విద్యుత్ తీగలపై తడి బట్టలు ఆరవేయడం వల్ల షాక్ సంభవించే ప్రమాదం ఉంది. జీఐ దండెం వైర్లలో ఇన్సులేషన్ సరిగ్గా లేకపోతే విద్యుత్ ప్రవహించే అవకాశం ఉంది.

రేకులతో జాగ్రత్త: ఇంటి ముందు స్టీల్ రేకులు విద్యుత్ తీగలకు తాకకుండా చూసుకోవాలి, ఎందుకంటే వీటికి కూడా విద్యుత్ సరఫరా జరిగే అవకాశం ఉంది.

రైతులకు ప్రత్యేక సూచనలు

ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు: పంట చేనుల్లో ట్రాన్స్‌ఫార్మర్లను కనీసం 6 అడుగుల ఎత్తులో ఏర్పాటు చేయాలి.

గడ్డి నివారణ: విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద గడ్డి లేకుండా చూసుకోవాలి. ఇది పశువులను ఆకర్షించకుండా ప్రమాదాలను నివారిస్తుంది.

పశువుల జాగ్రత్త: పశువులను మేతకు తీసుకెళ్లినప్పుడు విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల వద్దకు వెళ్లకుండా చూసుకోవాలి.

ఫెన్సింగ్ నిబంధనలు: పంటల చుట్టూ అటవీ జంతువుల రక్షణ కోసం ఏర్పాటు చేసే ఫెన్సింగ్‌కు విద్యుత్ సరఫరా చేయడం చట్టవిరుద్ధం. రైతులు దీనిని నివారించాలి.

చేపల పట్టుట: చేపలు పట్టడానికి విద్యుత్ వినియోగించడం కూడా చట్టవిరుద్ధం. ఇటువంటి చర్యలకు పాల్పడరాదు.

పశువులను కట్టవద్దు: ఇనుప విద్యుత్ స్తంభాలకు పశువులను కట్టివేయడం మానుకోవాలి, ఇది ప్రమాదకరం.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

సర్వీస్ వైర్ల సమస్య: వర్షాకాలంలో సర్వీస్ వైర్లకు కార్బన్ వచ్చి విద్యుత్ సరఫరా సరిగ్గా జరగకపోతే, వాటిని మార్చుకోవాలి.

విద్యుత్ తీగల దూరం: ఇండ్లకు ఆనుకొని విద్యుత్ తీగలు లేకుండా చూసుకోవాలి.

ఎర్తింగ్ ఏర్పాటు: ఇంటి విద్యుత్ వైరింగ్‌కు సరైన ఎర్తింగ్ ఏర్పాటు చేయాలి. తడి చేతులతో సెల్‌ఫోన్ చార్జింగ్ వైర్లను తాకకూడదు.

సెల్‌ఫోన్ జాగ్రత్తలు: చార్జింగ్‌లో ఉన్న సెల్‌ఫోన్‌తో మాట్లాడటం, తడి చేతులతో స్విచ్ ఆఫ్ చేయడం వంటివి నివారించాలి. చేతులను గుడ్డతో తుడిచి స్విచ్ ఆఫ్ చేసిన తర్వాత చార్జింగ్ వైర్ తీయాలి.

ప్రమాద సమయంలో చర్యలు

విద్యుత్ షాక్ నివారణ: ఎవరైనా విద్యుత్ షాక్‌కు గురైతే, ఆత్రుతగా వారిని తాకకూడదు. విద్యుత్ ప్రవహించని కర్ర లేదా ప్లాస్టిక్ వస్తువులతో వారిని విద్యుత్ సంబంధం నుంచి వేరు చేయాలి.

సొంత మరమ్మతులు వద్దు: సొంతంగా విద్యుత్ మరమ్మతులు చేయడం వల్ల ప్రాణాంతక ప్రమాదాలు సంభవించవచ్చు. ఎల్లప్పుడూ విద్యుత్ శాఖ సిబ్బంది సహాయం తీసుకోవాలి.

వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాలు నివారించడానికి రైతులు, వినియోగదారులు పై సూచనలను కచ్చితంగా పాటించాలని డీఈ నాగరాజు సూచించారు. విద్యుత్ తీగలతో అప్రమత్తంగా ఉండడం, సరైన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా ప్రమాదాలను సమర్థవంతంగా అరికట్టవచ్చు. ఏదైనా సమస్య తలెత్తితే విద్యుత్ శాఖ అధికారులను సంప్రదించడం ద్వారా సురక్షితంగా ఉండవచ్చు.

జాగ్రత్తలతో ప్రమాదాలకు దూరం



వర్షకాలంలో రైతులు, విద్యుత్ వినియోగదారులు జాగ్రత్తగా ఉంటే విద్యుత్ ప్రమాదాల నుంచి కాపాడుకోవచ్చు. ఎక్కడైనా విద్యుత్ వైర్లు తెగిన, లూజ్‌గా ఉన్నా, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఫ్యూజులు పోయినా సిబ్బందికి తెలియచేయాలి. వెంటనే తమ సిబ్బంది సరి చేస్తారు. ఏ సమస్య వచ్చినా తమ సిబ్బందికి సమాచారం ఇస్తే వెంటనే సరిచేస్తాం.తెలిసీ తెలియక సొంతంగా మరమ్మత్తుతులు చేపట్టి ప్రమాదాల భారీన పడొద్దు. మా సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కారిస్తారు.

– డి.నాగరాజు, డీఈ నిర్మల్

ప్రభుత్వ పాఠశాలలను ఆదరించాలి

- డీఈవో రామారావు

నిర్మల్ రూరల్: తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి వాటిని ఆదరించాలని డీఈవో రామారావు కోరారు. నిర్మల్ రూరల్ మండలం న్యూ ముజ్గి ఉన్నత పాఠశాలలో బడిబాట కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఏర్పాటుచేసిన గ్రామసభలో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రస్తుతం ఎన్నో సౌకర్యాలు ఉన్నాయన్నారు. తల్లిదండ్రులు ఆలోచించి ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించాలి కోరారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు రూపొందించిన కరపత్రాలు విడుదల చేశారు. ఇందులో ఎంఈవో వెంకటేశ్వర్, ఎస్‌వోలు ప్రవీణ్‌కుమార్, నరసయ్య, లింబాద్రి, హెచ్‌ఎం సుధీర్, రమేశ్, పీడీ సంగీత పాల్గొన్నారు.

క్లుప్తంగా

కోలిండియా అసిస్టెంట్ మేనేజర్‌గా ఎంపిక


పవన్‌కల్యాణ్

దండేపల్లి: మండలంలోని తాళ్లపేటకు చెందిన వేల్పుల పవన్‌కల్యాణ్ కోలిండియా అసిస్టెంట్ మేనేజర్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. ఈయన టెన్త్ వరకు తాళ్లపేట ప్రభుత్వ పాఠశాలలో చదివాడు. వారణాసిలోని బనారస్ హిందూ యూనివర్సిటీలో ఐఐటీ పూర్తిచేసి, కోలిండియా అసిస్టెంట్ మే నే జర్ ఉద్యోగం సాధించాడు. దీంతో కుటుంబీకులు, గ్రామస్తులు అతన్ని అభినందించారు.

సైబర్ వలలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి

మందమర్రిరూరల్: సైబర్ వలలో పడి సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని మోసపోయి రూ.2.30 లక్షల పోగొట్టుకుంది. ఈమేరకు మందమర్రి పోలీసుస్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేసింది. ఎస్సై రాజశేఖర్ కథనం ప్రకారం.. టీసీఎస్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పని చేస్తున్న పట్టణానికి చెందిన యువతి గత కొంతకాలంగా సెలవుల్లో ఉండగా వర్క్ ఫ్రం హోం కోసం సోషల్‌మీడియాలో వెతుకుతుండగా సైబర్ నేరస్తులు పరిచయమయ్యారు. తక్కువకాలంలో టాస్క్‌లు చేయడం వల్ల ఎక్కువ డబ్బులు సంపాదించవచ్చునని నమ్మబలికారు. ముందుగా కొంతడబ్బులు ఆశచూపారు. తర్వాత ప్రీపెయిడ్ టాస్క్‌ల పేరిట ఆ యువతి వద్ద నుంచి రూ.2.30 లక్షలు పోగొట్టుకుంది. బాధితురాలి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

తప్పిపోయిన చిన్నారిని అప్పగింత


అప్పగిస్తున్న పోలీసులు

మందమర్రిరూరల్: తప్పిపోయిన చిన్నారిని తల్లిదండ్రులకు అప్పగించినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. పట్టణంలోని మొదటిజోన్ సీఎస్ఐ చర్చికి సమీపంలోని మూడేళ్ల చిన్నారి ఆరాధ్య శుక్రవారం మధ్యాహ్నం ఇంటి నుంచి తప్పిపోయింది. స్థానిక సాయిబాబా ఆలయం వద్ద ఆ చిన్నారి అక్కడివారికి కనిపించింది. వారు బ్లూకోట్ పోలీసులకు అప్పగించారు. పోలీసులు వాట్సాప్ గ్రూప్ ద్వారా ప్రచారం చేయడంతో తల్లిదండ్రులు జమున–రాజులు సాయంత్రం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లగా చిన్నారిని అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.

మల్బరీ వేపకర్రల షెడ్డు దగ్ధం


దగ్ధమవుతున్న షెడ్డు

జన్నారం: మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో జునుగురు వెంకటేశ్‌కు చెందిన మల్బరీ వేపకర్రల షెడ్డు శుక్రవారం ప్రమాదవశాత్తు దగ్ధమైంది. షెడ్డులో మంటలు వ్యాపించడంతో స్థానికులు గమనించి అందించిన సమాచారంతో ఫైర్ అధికారి శ్రీనివాస్ సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకుని మంటలార్పారు. కర్రలకు నిప్పంటడంతో మొత్తం దగ్ధమైంది. కాగా, నష్టం వివరాలు ఇంకా తెలియరాలేదని ఫైర్ అధికారి తెలిపారు.






బాసరలో భక్తుల సందడి

బాసర: బాసర శ్రీ జ్ఞాన సరస్వతి ఆలయం శుక్రవారం భక్తులతో సందడిగా మారింది. సుదూర ప్రాంతాలు, వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చారు. ముందుగా పవిత్ర గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం అమ్మవారిని దర్శనం కోసం బారులు తీరారు. ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. తల్లిదండ్రులు చిన్నారులకు అర్చకులతో అక్షరాభ్యాసం చేయించారు. భక్తులు వివిధ అర్జిత సేవ టికెట్ల ద్వారా ఆలయానికి రూ.14 లక్షల భారీ ఆదాయం సమకూరిందని ఆలయ కార్యనిర్వహణ అధికారి సుధాకర్‌రెడ్డి తెలిపారు.

రైతుకు సహకారం

- ఆర్థిక బలోపేతానికి కేంద్రం చర్యలు
- ఉమ్మడి జిల్లాలో ఎఫ్‌పీవోలుగా 43 సొసైటీల ఎంపిక
- సాంకేతిక పరిజ్ఞానంతో మూడేళ్ల నిర్వహణ
- స్థానిక డిమాండ్‌కు అనుగుణంగా వ్యాపారాల అభివృద్ధి

ఉమ్మడి జిల్లాలో..

జిల్లా	సొసైటీలు	ఎఫ్‌పీవో ఎంపిక
ఆదిలాబాద్	28	15
మంచిర్యాల	20	12
నిర్మల్	17	08
కుమురంభీం	12	08
మొత్తం	77	43


ఎఫ్‌పీవోలుగా ఎంపికైన మందమర్రి పీఏసీఎస్

మంచిర్యాలఅగ్రికల్చర్: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో చిన్న, సన్నకారు రైతులను మరింత ఆర్థిక బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఎఫ్‌పీవో (ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్) పథకాన్ని ప్రవేశపెట్టింది. రైతుల ఆదాయం పెంపు, పెట్టుబడి రాయితీలు, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహార మందులు, వ్యవసాయ యంత్రాల కొనుగోళ్ల కోసం తక్కువ వడ్డీకి రుణాలు అందజేయడం, పంటల ఉత్పత్తుల శుద్ధి, గిట్టుబాటు ధర కల్పించేలా మార్కెట్ అనుసంధానానికి ఎఫ్‌పీవోలు కృషి చేయనున్నాయి. ఎఫ్‌పీవోలుగా ఎంపికైన స్థానిక డిమాండ్‌కు అనుగుణంగా వ్యాపారాలు అభివృద్ధి చేసుకోవాల్సి ఉంటుంది. ఎఫ్‌పీవోలో రైతు చేరితే వ్యవసాయం, అనుబంధ రంగాలు పాడి, మెడికల్‌షాపులు, ఫంక్షన్‌హాళ్లు, పాలు విక్రయాలు, తదితర వ్యాపారాలు స్థానికంగా అవసరాలకు అనుగుణంగా అభివృద్ధికి సహకారం అందించనుంది.

గుర్తించిన పీఏసీఎస్‌లకే ఎఫ్‌పీవోల హోదా

వ్యవసాయ పనిముట్లు, వ్యవసాయ యంత్రాల కొనుగోలు కోసం దీర్ఘకాలిక రుణాలు, ఎరువులు, సేంద్రియ విత్తనాలు, కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ధాన్యం సేకరణ చేయడం, పెట్రోల్ బంక్‌లు, రైస్‌మిల్లులు, ఇతర వ్యాపార లావాదేవీలను సమర్థవంతంగా నిర్వహిస్తున్న ప్రాథమిక సహకార సంఘాలను గుర్తించారు. వాటిని మాత్రమే రైతు ఉత్పత్తి సంఘాలు ఎఫ్‌పీవోల హోదా లభించింది. ఇవి ఆర్థికంగా మరింత బలోపేతం కానున్నాయి. స్థానికంగా డిమాండ్ ఉన్న వ్యాపారుల పెట్టుబడికి సహకారం అందించనుంది. ఎఫ్‌పీవోల యాజమాన్య బోర్డుల్లో మహిళా రైతులకు ప్రాతినిధ్యం కల్పించనున్నారు. ఇప్పటికే ఎంపిక చేసిన సంఘాల సభ్యుల నుంచి సభ్యత్వ నమోదు, వ్యాపార ప్రణాళికల తయారు, వాటి అమల్లో ఎదురయ్యే సమస్యల పరిష్కారానికి, కొనుగోలు చేసేందుకు ప్రత్యేకంగా అవసరమైన శిక్షణ ఇవ్వనున్నారు. ఉమ్మడి జిల్లాలో రైతులకు శిక్షణ కోసం వరంగల్‌కు చెందిన కాకతీయ సహకార యూనివర్సిటీ ప్రిన్సిపాల్ లాకవత్ యాకుబ్ నాయక్ అందించనున్నారు. రైతులు పండించిన ఉత్పత్తులను మార్కెట్‌లోకి తీసుకురావడానికి, వ్యాపార కార్యకలాపాల్లో పాల్గొనడానికి ఆర్థిక స్థితిగతులను మెరుగుపర్చడానికి రైతులకు సాంకేతిక పరిచయం చేయడం, మద్దతు ధర కల్పించడమే లక్ష్యంగా కేంద్రప్రభుత్వ రైతులు ఉత్పత్తిదారులు సంస్థలను ఏర్పాటు చేస్తోంది.

ఉమ్మడి జిల్లాలో..

ఉమ్మడి జిల్లాలో మొత్తం 77 సొసైటీలు ఉండగా సమర్థంగా నడుస్తున్న సొసైటీల్లో తొలి విడతలో 43 ఎంపికయ్యాయి. ఎంపిక చేసిన సొసైటీల్లో 300 నుంచి 750 మంది సభ్యుల వరకు సభ్యత్వం తీసుకోవాల్సి ఉంటుంది. ఒక్కో రైతు రూ.2 వేలు చెల్లిస్తే రైతుల వాటా రూ.15 లక్షలు, కేంద్ర ప్రభుత్వం ఈక్విటీ గ్రాంట్ కింద పెట్టుబడికి రూ.15 లక్షల ఆర్థికసాయం అందించనుంది. దీంతోపాటు మూడేళ్లపాటు కార్యాలయ నిర్వహణ కోసం సీవో, అకౌంటెంట్, సిబ్బందికి ఆరు నెలలకు రూ.3 లక్షల చొప్పున అందజేయనుంది.

వ్యాపారాల్లో ఆర్థికాభివృద్ధి చెందాలి




ఉమ్మడి జిల్లాలో పీఏసీఎస్‌ల్లో తొలివిడతలో 43 సొసైటీలను ఎఫ్‌పీవోలుగా రైతు ఉత్పత్తిదారుల సంస్థలు ఎంపికగా చేశాం. ఇప్పటికే రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగుతుంది. రైతుల నుంచి సభ్యత్వం నమోదు చేసుకుని కేంద్ర ప్రభుత్వం అందించే నిధులు సద్వినియోగం చేసుకుని వ్యాపార రంగాల్లో ఆర్థికాభివృద్ధి చెందాల్సి ఉంటుంది. స్థానిక వ్యాపారాల కోసం ప్రణాళిక రూపొందించి దానికి అనుగుణంగా కార్యచరణ చేపడుతాం. సభ్యత్వ నమోదు అనంతరం సభ్యులకు శిక్షణ అందిస్తాం.

– లకావత్ యాకుబ్ నాయక్, కాకతీయ సహకార యూనివర్సిటీ ప్రిన్సిపాల్

నేడు బక్రీద్

- మసీదులు, ఈద్గాలు ముస్తాబు
- ప్రత్యేక ప్రార్థనలకు ఏర్పాట్లు


చెన్నూర్‌లో ముస్తాబైన మసీదు

నెన్నెల/ఉట్నూర్‌రూరల్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో బక్రీద్‌కు మసీదులు, ఈద్గాలు ముస్తాబు చేశారు. శనివారం పండుగ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలకు ఆదిలాబాద్, మంచిర్యాల, నిర్మల్, ఆసిఫాబాద్ తదితర పట్టణాల్లో ఏర్పాట్లు చేశారు. ఇస్లాం క్యాలెండర్‌లోని బక్రీద్ మాసంలో 11వ రోజు పండుగ నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. త్యాగనిరతికి ప్రతీకగా ముస్లింలు పండుగ జరుపుకుంటారు. పండుగ రోజు జంతువులను బలి ఇచ్చి మాంసాన్ని కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, పేదలకు సమభాగాలుగా పంపిణీ చేస్తారు. ఈద్గాలు, మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. బక్రీద్ పండుగను త్యాగానికి ప్రతీకగా నెన్నెల మత గురువు షగీర్ అహ్మద్ పేర్కొన్నారు. చెడును నిరోధించడం, మంచిని పెంచడం, కష్టాల్లో సహనం వహిస్తూ త్యాగనిరతిని చూపించాలన్న సందేశమే ఖుర్బానీలో దాగి ఉందని, ప్రతీ ముస్లిం తన జీవిత కాలంలో ఒక్కసారైన హజ్ యాత్ర చేయాలని తెలిపారు. పండుగను శాంతియుత వాతావరణంలో కుటుంబ సమేతంగా జరుపుకోవాలని ఉట్నూర్‌లోని జామ మసీద్ మౌలానా కలీం పేర్కొన్నారు.

వనమహోత్సవ లక్ష్యాన్ని పూర్తిచేయాలి

- పీసీసీఎఫ్ డాక్టర్ సువర్ణ


మాట్లాడుతున్న పీసీసీఎఫ్ డాక్టర్ సువర్ణ

ఆదిలాబాద్‌టౌన్: వన మహోత్సవ లక్ష్యాన్ని పూర్తి చేయాలని రాష్ట్ర ముఖ్య అటవీ సంరక్షణ అధికారి (పీసీసీఎఫ్) డాక్టర్ సువర్ణ అన్నారు. బాసర జోన్ పరిధిలోని ఆదిలాబాద్, నిజామాబాద్, జగిత్యాల, నిర్మల్ జిల్లాల అటవీ శాఖ అధికారులతో శుక్రవారం జిల్లా కేంద్రంలోని అటవీశాఖ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వన మహోత్సవానికి సంబంధించి లక్ష్యాలను సాధించాలన్నారు. 46 లక్షల మొక్కలు నాటే లక్ష్యం పూర్తిచేయాలని పేర్కొన్నారు. ఎవరైనా కొత్తగా పోడు కోసం అటవీ భూములు సాగు చేస్తే కఠిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మావల హరితవనం పార్కు, కుంటాల జలపాతాల్లో సఫారీలను ఏర్పాటు చేస్తామన్నారు. వాటి అభివృద్ధి కోసం కృషి చేస్తామని పేర్కొన్నారు. ఆదిలాబాద్ రూరల్ మండలంలోని చించుఘాట్ ప్రాంతాన్ని పరిశీలించారు. ఆమె వెంట ఆదిలాబాద్, నిజామాబాద్, నిర్మల్, జగిత్యాల డీఎఫ్‌ఓలు ప్రశాంత్ బాజీరావు పాటిల్, వికాస్ మీనస్, నాగిబాను, రవిప్రసాద్ తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న క్రికెట్ ఎంపిక పోటీలు

మంచిర్యాలటౌన్: ఆదిలాబాద్ జిల్లా క్రికెట్ అసోసియేషన్, హెచ్‌సీఏ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక కోసం నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలు కొనసాగుతున్నాయి. ఇప్పటికే ఆరు టీంల మధ్య జరిగిన పోటీల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారుల నుంచి 11 మందిని ఎంపిక చేసేందుకు జిల్లాకేంద్రంలోని ఉషోదయ స్కూల్ మైదానంలో గురు, శుక్రవారాల్లో గ్రీన్, బ్లూ టీంల మధ్య రెండు ఇన్నింగ్స్‌ల మ్యాచ్‌లు నిర్వహించారు. గ్రీన్ టీం మొదటి ఇన్నింగ్స్‌లో 89 పరుగులు, రెండవ ఇన్నింగ్స్‌లో 274 పరుగులు చేసింది. ఈ టీంకు చెందిన వి. లక్ష్మణ్ 8 ఓవర్లలో నాలుగు వికెట్లు తీశాడు. ఆ తర్వాత బ్లూ టీం మొదటి ఇన్నింగ్స్‌లో 149 పరుగులు, రెండో ఇన్నింగ్స్‌లో 220 పరుగులు చేసి గ్రీన్ టీంపై 1 వికెట్‌తో విజయం సాధించినట్లు కోచ్ ప్రదీప్ తెలిపారు. బ్లూ టీంలో వి.సింహాద్రి 51 పరుగులు చేసి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. మరో రెండు రోజులు జరిగే ఎంపిక పోటీల్లో గెలుపొందిన టీంల నుంచి 11 మంది క్రీడాకారులను రాష్ట్రస్థాయికి ఎంపిక చేయనున్నట్లు కోచ్ తెలిపారు.

నైపుణ్యాలతో బోధన ప్రమాణాలు మెరుగు


డిపార్ట్‌మెంట్ ఫ్యాకల్టీతో ఇన్‌చార్జి వీసీ గోవర్ధన్

బాసర: కమ్యూనికేషన్ నైపుణ్యాలు బోధన ప్రమాణాలు మెరుగుపర్చడంలో కీలకమని ఇన్‌చార్జి వీసీ గోవర్ధన్ పేర్కొన్నారు. ఆర్జీయూకేటీలో శుక్రవారం ఇంగ్లిష్ విభాగం ఆధ్వర్యంలో ఎఫెక్టివ్ కమ్యూనికేషన్ స్కిల్స్'అనే అంశంపై ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి వీసీ మాట్లాడుతూ ఫ్యాకల్టీలు తమ ప్రొఫెషనల్ అభివృద్ధికి ఇవి ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమం బోధనలో నైపుణ్యాల అభివృద్ధికి దోహదపడేలా ఉంటుందన్నారు. కార్యక్రమ సమన్వయకులుగా హెచ్ఓడీ విజయ్‌కుమార్ అప్పింగర్, అసోసియేట్ డీన్లు విఠల్, మహేశ్, నాగరాజు, పీఆర్వో విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పిచ్చుక తెచ్చిన ప్రమాదం


ఆహుతైన ఊరపిచ్చుక

వేమనపల్లి: మండలంలోని లక్ష్మీపూర్‌లో శుక్రవారం ఊరపిచ్చుక విద్యుత్ తీగలకు తగిలి వరిగడ్డి వాముపై పడింది. క్షణాల్లో మంటలు చెలరేగాయి. ఊరికే ముప్పు వాటిల్లే అవకాశం ఉండగా గ్రామస్తుల సమయస్ఫూర్తితో పెను ప్రమాదం తప్పింది. గ్రామానికి చెందిన మద్దూరి బానయ్య ఇంటి మీదుగా ట్రాన్స్‌కో అధికారులు విద్యుత్ లైన్ వేశారు. ఊరపిచ్చుక విద్యుత్ తీగలకు తగిలి గడ్డివాములో పడిపోయింది. మంటలు వ్యాపించడంతో గ్రామస్తులు అప్రమత్తమై సాగునీటి బోర్లు ఆన్‌చేసి మంటలార్పే ప్రయత్నం చేశారు. రెండు గంటలు కష్టపడి మంటలు వ్యాపించకుండా చర్యలు తీసుకున్నారు. అగ్ని ప్రమాదంలో సుమారు 8 ట్రాక్టర్ల వరిగడ్డి కాలిపోయింది. రూ.25 వేల నష్టం వాటిల్లినట్లు రైతులు తెలిపారు. ప్రమాద స్థలాన్ని ఆర్ఐ అబ్దుల్ ఖాలీక్ పరిశీలించారు.

‘ఎరువులు తక్కువ మోతాదు వల్లే తగ్గిన దిగుబడి’

మంచిర్యాలఅగ్రికల్చర్: గత ఖరీఫ్ సీజన్‌లో విత్తన నాణ్యతా లోపం వల్ల వరి పంటలో దిగుబడి తగ్గలేదని, దండేపల్లి మండలం మాకులపేటకు చెందిన అత్తె రామయ్య పంటలో సిఫారసు కంటే ఎన్, పీ ఎరువులు తక్కువ మోతాదులో వేయడం వల్లనే దిగుబడి తగ్గిందని జిల్లా వ్యవసాయ అధికారి కల్పన ఒక ప్రకటనలో తెలిపారు. అప్పుడు శాస్త్రవేత్తలు పరిశీలించారని, ఎరువులు తక్కువగా, చీడపీడల నివారణకు నియంత్రణ చర్యలు తీసుకోకపోవడంతో దిగుబడి తగ్గిందని పేర్కొన్నారు. జైపూర్ మండలం కుందారానికి చెందిన రైతు నుంచి వరి విత్తనాలతో దిగుబడి తగ్గినట్లు ఎలాంటి ఫిర్యాదు రాలేదని, నెన్నెల మండలానికి చెందిన రైతు తోట మధు ఎకరం 26గుంటల్లో పత్తి పంట సాగు చేశారని, వరి పంట వేయలేదని తెలిపారు.

కౌలుకు సాగును గుర్తించరా..?

''నా స్వంత భూమి ఎకరం 26గుంటల్లో పత్తి సాగు చేసుకున్న. మరో ఐదెకరాలు కౌలుకు భూమి తీసుకొని మా నాన్న, నేను వరి సాగు చేసినం. వ్యవసాయ అధికారులు ఫోన్ చేసి నాకు ఎంత భూమి ఉంది, ఏ పంట వేశావని మాత్రమే అడిగారు. పత్తి పంటతోపాటు కౌలుకు తీసుకొని వరి సాగు చేస్తే గుర్తించారా..? దిగుబడి తగ్గి 60 బస్తాలు మాత్రమే వచ్చింది..'' అని నెన్నెల మండలానికి చెందిన తోట మధు ‘సాక్షి’కి వివరించారు. వరి పంటను వ్యవసాయ అధికారులు, కంపెనీల వాళ్లు తన ఒక్కరిదే కాకుండా ఇతర రైతుల పొలాల కూడా పరిశీలించారని తెలిపారు. నాటిన నెలకే పొట్టకు రావడం, పిలుకలు లేకపోవడం, కొంత ఎదుగ ఇలా మూడు రకాల పెరిగిందని, ఒకసారి కంపెనీ వాళ్లు వచ్చి చూసి మళ్లీ తర్వాత వస్తానని చెప్పి వెళ్లారని, దిగుబడి వచ్చిన వరకు కూడా రాలేదని తెలిపారు.

చెరువులో ట్రాక్టర్ పడి వ్యక్తి మృతి


తిరుపతి మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు

చెన్నూర్‌రూరల్: మండలంలోని గంగారం గ్రామంలో ట్రాక్టర్‌తో పంట చేనును దున్నుతుండగా ప్రమాదవశాత్తు చెరువులో పడి కామెర తిరుపతి(45) మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంథని మండలం దుబ్బపల్లికి చెందిన తిరుపతి తన అత్తగారి గ్రామమైన చెన్నూర్ మండలం గంగారం గ్రామానికి గతనెల క్రితం వచ్చి ఇక్కడే ఉంటున్నాడు. తిరుపతి ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం ట్రాక్టర్‌తో తన బంధువుల పంట చేనును దున్నుతున్నాడు. రివర్స్‌లో ఒడ్డుపైకి వస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు ట్రాక్టర్ పక్కనే ఉన్న చేపల చెరువులో పడింది. అందులో కొంతమేర నీరు ఉండేసరికి తిరుపతి అక్కడిక్కడే మృతిచెందాడు. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటేశ్వర్‌రావు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

వృత్తి నైపుణ్య శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌టౌన్: ఉచిత వృత్తి నైపుణ్య శిక్షణకు నిరుద్యోగుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు న్యాక్ అసిస్టెంట్ డైరెక్టర్ నాగేంద్రం ఓ ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వ నాబార్డు సంస్థ నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (న్యాక్) ఆధ్వర్యంలో ప్లంబింగ్, పైప్ ఫిట్టర్, ఎలక్ట్రికల్ కోర్సుల్లో ఉచితంగా మూడు నెలల శిక్షణ అందించనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణలో పాల్గొనేవారికి ఉచిత భోజనం, వసతి, శిక్షణ సామగ్రి అందజేయనున్నట్లు తెలిపారు. శిక్షణ అనంతరం న్యాక్ నుంచి సర్టిఫికెట్ అందించనున్నట్లు పేర్కొన్నారు. దీంతోపాటు ఆయా ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగావకాశాలను కల్పించనున్నట్లు వివరించారు. 18 నుంచి 40 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న నిరుద్యోగ యువకులు అర్హులన్నారు. అభ్యర్థులు విద్యార్హత సర్టిఫికెట్, కుల, ఆదాయ, నివాస ధ్రువపత్రాలతోపాటు ఆధార్, రేషన్‌కార్డు, నాలుగు పాస్‌ఫొటోలు జతచేసి న్యాక్ కార్యాలయం, లేకపోతే జెడ్పీ కార్యాలయంలో ఈనెల 18 లోగా అందజేయాలని సూచించారు.

ఉద్యోగం రావడం లేదని ఆత్మహత్య

చెన్నూర్: పట్టణంలోని ఆదర్శనగర్ కాలనీకి చెందిన పేరాల ఓంసాయి(25) ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓంసాయి బీకాం పూర్తి చేసి రెండుసార్లు ఉద్యోగ ప్రయత్నం చేశాడు. ఉద్యోగం రాకపోవడంతో ఇంటి వద్ద ఖాళీగా ఉంటున్నాడు. దీంతో మనస్తాపం చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నాడు. శుక్రవారం తెల్లవారుజామున తలుపులు తీసే సరికి ఓంసాయి శవమై కనిపించాడు. మృతుడి తండ్రి సిరోంచ దగ్గర పాఠశాలలో అటెండర్‌గా పని చేస్తున్నాడు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి ఆత్మహత్యకు గల కారణాలపై ఆరా తీశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటేశ్వర్‌రావు తెలిపారు.

పెళ్లి కావడం లేదని యువకుడు..


ఆకాశ్ (ఫైల్)

తానూరు: పెళ్లి కావడం లేదని యువకుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ట్రెయినీ ఎస్సై నవనీత్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం ప్రకారం..మండల కేంద్రానికి చెందిన వాఘ్మారే ఆకాశ్ (25) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేసి కుటుంబాన్ని పోషించేవాడు. తల్లి కొద్యబాయికి కొంత కాలంగా మానసిక పరిస్థితి బాగాలేదు. ఇంట్లో పనులు చేసేవారు లేక వంట చేసుకోవడం ఇబ్బందిగా ఉందని, తల్లి మానసిక పరిస్థితి బాగా లేకపోవడం, తనకు పెళ్లి కావడం లేదని సోదరికి గురువారం రాత్రి ఫోన్‌లో చెప్పాడు. తల్లి బంధువుల ఇంటికి వెళ్లడంతో ఒంటరిగా ఉన్న ఆకాశ్ మనస్తాపంతో రాత్రి ఇంట్లో ఉరేసుకున్నాడు. శుక్రవారం ఉదయం ఇంటిపక్క వారు చూసి సమాచారమివ్వడంతో ట్రెయినీ ఎస్సై అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. సోదరి గీతాంజలి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేసున్నారు.

జీవితంపై విరక్తితో వ్యక్తి..

కడెం: జీవితంపై విరక్తితో వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి తెలిపారు. ఎస్సై, స్థానికులు తెలిపిన వివరాలు.. మండలంలోని చిట్యాల్‌కు చెందిన బానవత్ రవి(35) నాలుగేళ్ల క్రితం ఉపాధి నిమిత్తం దుబాయ్ వెళ్లి అప్పుల పాలయ్యాడు. అప్పుల బాధతో జీవితంపై విరక్తి చెందాడు. గురువారం రాత్రి ఇంట్లో ఉరేసుకున్నాడు. తల్లి జీజాబాయి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్సపొందుతూ వృద్ధుడి మృతి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): గుర్తుతెలియని పురుగుల మందు తాగిన వృద్ధుడు చికిత్స పొందుతూ మృతిచెందాడు. హాజీపూర్ ఎస్సై స్వరూప్‌రాజ్ కథనం ప్రకారం..మండలంలోని ముల్కల్ల గ్రామంలోని వాగొడ్డుపల్లెకు చెందిన పెట్టం మల్లయ్య (68), భార్య మల్లక్క దంపతులు. వారితో ఉన్న పాత గొడవలను మనసులో పెట్టుకుని వాగొడ్డుపల్లెకు చెందిన లగిశెట్టి అమ్మక్క, ఆమె కుటుంబ సభ్యులు గురువారం మల్లయ్య, మల్లక్కపై గురువారం భౌతిక దాడి చేసి దుర్భాషలాడి మానసిక ఇబ్బందులకు గురిచేశారు. పిల్లలు లేని మల్లయ్య చావక ఎందుకు బతుకుతున్నావని ఊరందరి ముందు తిట్టడంతో తీవ్ర మనస్తాపం చెందాడు. మల్లయ్య తన ఇంటి వెనుక పశువుల కొట్టంలో మధ్యాహ్న సమయంలో గుర్తుతెలియని పురుగుల మందు తాగాడు. స్థానికులు గమనించి అతన్ని మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్సపొందుతూ రాత్రి మృతిచెందాడు. భార్య మల్లక్క ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బావిలో పడి వృద్ధురాలు..

లక్సెట్టిపేట: ప్రమాదవశాత్తు బావిలో పడి వృద్ధురాలు మృతిచెందినట్లు ఎస్సై గోపతి సురేష్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం రాయపట్నానికి చెందిన బొప్పు శంకరవ్వ (69) ఈ నెల 4న శుభకార్యం కోసం లక్సెట్టిపేట మున్సిపాలిటీ పరిధిలోని గంపలపల్లిలో తన బంధువుల ఇంటికి వచ్చింది. సాయంత్రం తిరిగి ఇంటికి వెళ్తున్నానని చెప్పి బయల్దేరింది. ఇంటికి చేరుకోకపోవడంతో కుటుంబ సభ్యులు ఆమె ఆచూకీ కోసం వెతకగా దొరకలేదు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. శుక్రవారం ఉదయం గంపలపల్లి శివారు సమీపంలోని బావిలో శవమై కనిపించింది. మృతదేహం శంకరవ్వది గుర్తించారు. ప్రమాదవశాత్తు బావిలో పడి మృతిచెందినట్లుగా నిర్ధారించారు. మృతురాలి కూతురు మంగవ్వ ఫిర్యాదుతో కేసుదర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బైక్‌కు నిప్పు పెట్టిన వ్యక్తిపై కేసు

దహెగాం: మండలంలోని కోత్మీర్ పంచాయతీ పరిధి దుబ్బగూడకు చెందిన కొత్త తిరుపతి బైక్‌ను దహనం చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. తిరుపతి, కోత్మీర్‌కు చెందిన పిల్లల మధుకర్ కోత్మీర్ వద్ద గురువారం రాత్రి గొడవపడ్డారు. మ ధుకర్ తాగినమైకంలో చంపుతానని బెదిరించి తిరుపతి బైక్‌కు అడ్డుపడి నిప్పు పెట్టి దహనం చేశాడు. తిరుపతి ఫిర్యాదుతో శుక్రవారం కేసు దర్యాప్తు చేస్తున్నారు.